# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-05-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మత్స్యకారులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా ప్రోత్సహిస్తామన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **వినూత్న కార్యక్రమాలతో ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ ఆదర్శంగా నిలుస్తోందని వెల్లడించిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్.**

3. **రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణమే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

4. **తిరుమలలో భక్తుల సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ .**

==========================

చేపల వేటతో పాటు నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా మత్స్యకారులను ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఈరోజు పర్యటిస్తున్నారు. జిల్లాలోని కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' ఆయన పాల్గొని మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు.

--------------------------

తపాలా శాఖలో మెరుగైన సాంకేతిక సాధనాలు అందుబాటులోకి తీసుకువచ్చి సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, అసోం, బీహార్, హర్యానా పోస్టల్ సర్కిల్స్ ఆర్థిక కార్యాచరణ పనితీరుపై ఢిల్లీలో నిన్న విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మొబైల్ అవుట్‌రీచ్ ద్వారా తపాలా సేవలను నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్లడం, వారాంతాల్లో కూడా సేవల అందుబాటు కల్పించడం, డిజిటల్, లాజిస్టిక్స్ రంగాల్లో విస్తరణపై దృష్టి పెట్టడం వంటి అంశాలతో ఇతర పోస్టల్ సర్కిల్స్‌కు

ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. భారత తపాలా శాఖను మరింత ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, పార్శిల్ బుకింగ్ డెలివరీ సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణమే మంజూరు చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులతో అమరావతి నుంచి దృశ్య మాధ్యమం విధానంలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో గృహ, వ్యాపార, పారిశ్రామిక వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతినే అవకాశాలు ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే సూర్యఘర్, పీఎం కుసుమ్, పునరుద్ధరణ పంపిణీ రంగ  పథకాల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అమరావతిలో జరిగిన 4వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో భూసేకరణ, అటవీ అనుమతులు వంటి  సమస్యలపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ రహదారుల నిర్మాణంలో అటవీ అనుమతులను త్వరగా పూర్తి చేయాలని  ఆదేశించారు.అలాగే రైల్వే ప్రాజెక్టుల విషయంలో జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించి భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని మంత్రి సూచించారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే. శివ కుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వేర్వేరుగా ఈ రోజు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల మంత్రి అనగాని సత్యప్రసాద్ పాత్రికేయులతో మాట్లాడుతూ, తిరుమలలో భక్తుల సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని  తెలిపారు. భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యాలు, వసతి, అన్నప్రసాదం మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో పనిచేసే అధికారులు, సిబ్బందికి శాసన వ్యవస్థకు సంబంధించిన వివిధ అంశాలపై  మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి. పార్లమెంటరీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీస్ (ప్రైడ్) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,  శాసన వ్యవస్థలో సిబ్బంది నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. చట్టాల రూపకల్పన, ప్రైవేట్ బిల్లులు, తీర్మానాలు, శూన్య గంట , ప్రశ్నోత్తరాలు, శాసన వ్యవస్థలో బడ్జెట్ ప్రక్రియలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సచివాలయం ప్రైడ్ డైరెక్టర్

పికె మల్లిక్‌తో పాటు రాష్ట్ర శాసన సభ అధికారులు పాల్గొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అనంతపురం జిల్లాలో ఈ రోజు నుంచి "జన్ భాగిదారి" కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. అనంతపురంలో ఆయన ఈ రోజు మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్, ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాల కింద గిరిజనులకు లభించే ప్రయోజనాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలకు ప్రజలు హాజరై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

---------------------------

ఆకాశవాణి 90 వసంతాల వేడుకల్లో భాగంగా విశాఖపట్నం ఆకాశవాణి ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో మూడు కిలోమీటర్ల వాక్‌థాన్ కార్యక్రమాన్ని స్థానిక ఆర్కే బీచ్ రోడ్ లో ఈరోజు నిర్వహించారు. ఈ వాక్‌థాన్ ను విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆకాశవాణి గత 90 సంవత్సరాలుగా ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా విపత్తు నిర్వహణ సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో ఆకాశవాణి కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

వాయిస్..25.. సెకన్లు

అనంతరం ప్రాంతీయ ఛానల్ మేనేజర్ ఆర్. హర్షలత మాట్లాడుతూ, "బహుజన హితాయ – బహుజన సుఖాయ" అనే నినాదంతో ఆకాశవాణి విజ్ఞానం, వినోదంతో పాటు విశ్వసనీయ సమాచారాన్ని అందిస్తోందన్నారు.

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో నిర్వహిస్తున్న శ్రీ మోదకొండమ్మ అమ్మవారి వార్షిక జాతర ఈరోజుతో ముగియనుంది. జాతర చివరి రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. శతకం పట్టు ప్రాంతం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను తిరిగి ఆలయానికి తీసుకువచ్చే కార్యక్రమంతో జాతర ఉత్సవాలు ముగియనున్నాయి. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సుమారు 700 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించడంతో పాటు డ్రోన్ నిఘా, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు.

=====================